క్లుప్తంగా

ఉత్తమ ఏఈగా రవికుమార్



ఆత్మకూరు : విద్యుత్‌శాఖ మండల ఏఈ రవికుమార్ హనుమకొండ జిల్లా ఉత్తమ ఏఈగా ఎంపికయ్యారు. కాగా ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఆపరేషన్ డైరెక్టర్ మోహన్‌రావు చేతుల మీదుగా ఆదివారం అవార్డు అందుకున్నారు. ఏఈ రవికుమార్‌ను అధికారులు సామ్యా నాయక్, సాంబరెడ్డి, సుబ్రహ్మణ్యేశ్వర్, అనిల్ అభినందించారు.

విద్యుదాఘాతంలో గేదె మృతి



వేలేరు : విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన సంఘటన మండలంలోని పీచర గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత రైతు జల్తారి శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ కిందికి వేలాడుతూ ఉండగా మేతకు వెళ్తున్న గేదె దాన్ని తగిలింది.ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై గేదె అక్కడికక్కడే మరణించింది. అలాగే ఇటీవల ఇదే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మల్లారెడ్డికి చెందిన గేదె సైతం షాక్‌తో మృతిచెందింది. అయినా కూడా విద్యుత్ అధికారులు స్పందించలేదు. సుమారు రూ.30 వేల విలువ గల గేదె మృతి చెందిందని, తనకు ఆర్థికంగా ఆదుకోవాలని రైతు శ్రీనివాస్ కోరాడు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గుండెపోటుతో ప్రైవేట్ ఉపాధ్యాయుడు..


నటరాజ్ (ఫైల్)

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన వెనిశెట్టి నటరాజ్ (32) గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నటరాజ్ ఆదివారం ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బీపీ తగ్గడంతో అప్పటికే పరిస్థితి విషమించి గుండెపోటుకు గురై నటరాజ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపారు.

పరకాలలో భారీ చోరీ

- రూ.18లక్షల విలువగల బంగారు ఆభరణాలు, రూ.80వేల నగదు మాయం..!



పరకాల : పరకాల పట్టణంలో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం భారీ దొంగతనానికి పాల్పడ్డారు. వివరాలు.. పరకాల పట్టణానికి చెందిన అనంతుల ప్రకాశ్–భవాని దంపతులు అంగడి బజార్‌లో సారీ సెంటర్ నడుపుతున్నారు. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన వారిద్దరూ రాత్రి దుకాణం మూసి ఇంటికి చేరుకునే సరికే తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న వస్తువులు చిందరవందరంగా పడి ఉన్నాయి. బీరువాలో దాచుకున్న రూ.18లక్షల విలువ చేసే బంగారు అభరణాలతో పాటు రూ.80 వేల నగదు ఎత్తుకెళ్లడంతో బోరుమని విలపించారు. డయల్ –100 ద్వారా పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రమేష్, పోలీసులు చేరుకొని పరిశీలించారు. రెండు నెలల క్రితమే ప్రకాశ్ సోదరుడు మహేశ్ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తులు పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే.

ఉపాధి పనికి అన్నదాతలు


ఉపాధిపనులు చేస్తున్న రైతులు, కూలీలు

- సాగునీరు లేక కూలికి వెళ్తున్న రైతులు
- జోరుగా పూడికతీత పనులు

కమలాపూర్ : కాలం కలిసివస్తే పది మందికి పనులు కల్పించే కర్షకులు వారు. పంట సాగులో ఇతరులకు ఉపాధి కల్పించి పట్టెడన్నం పెట్టే అన్నదాతలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలుగా పని చేస్తున్నారు. మొన్నటిదాకా సాగు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడి ఎలాగోలా పంట కోతలు పూర్తి చేసిన రైతులు ప్రస్తుతం ఎలాంటి వ్యవసాయ పనులు లేక ఖాళీగా ఉంటున్నారు. ఇదే తరుణంలో మండల వ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద ఎండిపోయిన చెరువులు, కుంటల్లో పూడిక తీత పనులు, ఎస్సారెస్పీ కాల్వల్లో సిల్ట్ తొలగింపు పనులు జోరుగా సాగుతున్నాయి.

ఉపాధి పనికి పోతానం



సొంతంగా వ్యవసాయ పనులు చేసుకోవడంతో పాటు మరికొందరికి ఉపాధి సూపెట్టేటోళ్లం. ఇప్పుడు భూగర్భ జలాలు అడుగంటిపోయి బావుల్లో నీళ్లు లేకుండా పోతానయి. రూ.లక్షల్లో ఖర్చు చేసి పూడిక తీయించినా, కొత్త బావులు తవ్వించినా లాభం లేదు. వ్యవసాయ పనుల్లేక రోజు ఉపాధి పనికి పోతానం.

-కట్కూరి కృష్ణారెడ్డి, కమలాపూర్

వ్యవసాయ పనులు లేవు

పంట సాగుకు సరిపడా నీళ్లు లేక వ్యవసాయ పనులు బందైనయి. నీళ్లుంటే వ్యవసాయ పనులు చేసుకునేటోళ్లమే. కానీ ఈ ఎండాకాలంలో చెరువులు, కుంటలన్నీ ఎండిపోయి బావుల్లో నీళ్లు ఎండి పోయినయి. వ్యవసాయ పనుల్లేక ఉపాధి పనులకు పోతానం. భూసారం పెంచుకొనేందుకు మట్టిని తరలిస్తున్నాం.

- దయ్యాల రవి, కమలాపూర్

వానాకాలమైనా కలిసొస్తదో? లేదో?



చెరువులు, కుంటల్లో నీళ్లుంటే మా బావుల్లో నీళ్లుండేవి. సాగు నీళ్లుంటే ఈ పాటికి వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండేటోళ్లం. తాగు, సాగు నీటికి మండలానికే పెద్ద దిక్కుగా ఉన్న కమలాపూర్ పెద్ద చెరువు ఈ సారి ఎండిపోయింది. మాకు తెలువని పని కాకపోయినా నలుగురికి ఉపాధి సూపెట్టే మేము వ్యవసాయ పనుల్లేక ఇలా ఉపాధి హామీ కూలీ పనులకు పోవాల్సి వస్తోంది.

- పెండ్యాల సాజన్‌రెడ్డి, శంభునిపల్లి

రైతులు పనికి వస్తాండ్లు



వ్యవసాయ పనులు ఉన్నప్పుడు రైతులు, కూలీలు ఎవరూ ఉపాధి పనులకు రాకపోయేది. కానీ నెల రోజుల నుంచి రైతులు, కూలీలు అధికసంఖ్యలో ఉపాధి హామీ పనులకు వస్తాండ్లు. మరో వైపు నీళ్లు లేక చెరువులు, కుంటలన్నీ ఎండిపోవడంతో పూడిక తీత పనులు జోరుగా సాగుతానయి. ఇటు పూడిక తీత పనులకు వచ్చిన రైతులు పూడిక మట్టిని తమ పంట పొలాలకు తోలుకు పోతున్నారు.

- మోడెం తిరుపతిగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్

108 పైలట్ల సేవలు అభినందనీయం


పైలట్లతో కలిసి కేట్ కట్ చేస్తున్నశివకుమార్

హన్మకొండ అర్బన్: ప్రమాదాలు, విపత్తులు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలను రక్షించడంలో 108 అంబులెన్స్ పైలట్లు ప్రాణదాతలుగా నిలుస్తున్న తీరు అభినందనీయమని 108 ప్రాజెక్ట్ ఆఫీసర్ పాటి శివకుమార్ కొనియాడారు. హనుమకొండ కలెక్టరేట్‌లో 108 సిబ్బంది నేషనల్ పైలట్ డే వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి మాట్లాడారు. వారి కుటుంబాల్లో అనేక కష్టనష్టాలు ఉన్నప్పటికీ వృత్తి ధర్మం కోసం అత్యవసర సేవల్లో భాగంగా ప్రజాసేవకు పాటుపడుతున్న 108 పైలట్ల సేవలు గొప్పవన్నారు. నేషనల్ పైలెట్ డే సందర్భంగా ఎంఆర్‌ఐ సంస్థ జిల్లా ఉత్తమ పైలట్లుగా గుర్తించిన హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని 108, 102 వాహనాల పైలట్లు మోడి సుమన్, పాముల అర్జున్‌వర్మకు శివకుమార్ ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల మేనేజర్లు లక్ష్మణ్, రాము, 108 సిబ్బంది, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్ మెమోరియల్ క్రికెట్ టోర్నీకి తీర్మానం


సమావేశంలో క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు త్వరలో వరంగల్ క్రికెట్ సంఘం మాజీ అధ్యక్షుడు దివంగత గుజ్జారి ప్రతాప్ స్మారక టోర్నమెంట్‌ను నిర్వహించేందుకు అసోసియేషన్ జనరల్ బాడీ ఏకగ్రీవంగా తీర్మానించింది. హనుమకొండలోని వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో 2023 – 24 వార్షిక జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలో జరిగిన అభివృద్ధిని సభ్యులకు జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ (మార్షల్) వివరించారు. లీగల్ అడ్వైజర్‌గా సత్యప్రకాష్, వరప్రసాద్ చార్టెడ్ అకౌంట్ తిప్పర్తి రాఘవరెడ్డి ప్రతిపాదించగా జిల్లాలోని 33మంది క్లబ్ కార్యదర్శులు ఆమోదించారు. అనంతరం సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు దివంగత అనిల్ మెమోరియల్ టోర్నమెంట్‌ను అండర్ –19 కేటగిరీతో పాటు, అండర్ –16 కేటగిరీలో నిర్వహించేందుకు క్లబ్ కార్యదర్శులు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. కమిటీ చైర్మన్‌గా కోదండపాణి, సభ్యులుగా మార్నేని ఉదయ భానురావు, అరుణ్, శ్రీనివాస్‌రెడ్డి, స్వామిచరణ్‌ను నియమిస్తూ జనరల్ బాడీ ఆమోదించినట్లు వివరించారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఖాజా, రఘురాం, స్వామిచరణ్, సంయుక్త కార్యదర్శి ఉపేందర్, కోశాధికారి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, అభినవ్ వినయ్, మట్టెడ కుమార్, రాము పాల్గొన్నారు.

'సమాచార చట్టం' ఎంతో ఉపయోగకరం


సమావేశంలో మాట్లాడుతున్న కేశవులు

నయీంనగర్: యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన సమాచార హక్కు చట్టంతో సమాజంలో విప్లవాత్మక మార్పులతో పాటు ప్రజలకు విస్తృత సేవలు అందుబాటులోకి వచ్చి జవాబుదారితనం పెరిగిందని సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బి.కేశవులు అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అవగాహన సదస్సులు, ర్యాలీలు, ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగించినట్లు వివరించారు. డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అంశాలపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసి నగదు ప్రవాహాన్ని అరికట్టేందుకు పాటుపడినట్లు వెల్లడించారు. సమావేశంలో గాడిపల్లి మధు, ఉషారాణి, సాంబయ్య, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలి


మాట్లాడుతున్న జీవన్‌గౌడ్

కాజీపేట అర్బన్: పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి, వరంగల్ జిల్లా నాయకుడు శివపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే ఎత్తివేయాలని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో జీవన్‌గౌడ్ మాట్లాడారు. ఫిబ్రవరిలో ప్రజా సంఘాల నాయకులపై బనాయించిన అక్రమ కేసులో భాగంగా ఈనెల 18వ తేదీన విద్యార్థి నాయకుల పేర్లను చేర్చడం దారుణమని వాపోయారు. యూనివర్సిటీలో విద్యార్థుల నుంచి సంతకాల సేకరించి, పోస్ట్ కార్డుల ద్వారా ఈ కుట్ర కేసు విషయాన్ని సీఎంకు తెలిసే విధంగా చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ, జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ రంజిత్‌కుమార్, విజయ్‌కన్నా, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, సంతోష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఐనవోలు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004–05 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఓ రిసార్ట్‌లో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉల్లాసంగా గడిపారు.ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకుని గురుభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో నకిరకంటి రాజు, సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'పట్టభద్రుల' పోలింగ్‌కు సిద్ధం


దామెర: పోలింగ్ సామగ్రితో చేరుకున్న ఎన్నికల సిబ్బంది


వేలేరు: కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది


పరకాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది


నడికూడ: పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బంది

పరకాల : ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ ఏర్పాట్లను ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. బ్యాలెట్ పద్ధతిలో గ్రాడ్యుయేట్స్ ప్రాధాన్యత ద్వారా అభ్యర్థిని ఎమ్మెల్సీగా ఎన్నుకోవడం జరుగుతుంది. పరకాల డివిజన్‌లోని నడికూడ, దామెర, ఆత్మకూరు, శాయంపేట, పరకాల మండలాల్లో 10,436 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా 6,589 మంది పురుషులు, 3,847 మంది మహిళ ఓట్లు ఉన్నాయి. వీరి కోసం ఆత్మకూరు–2 పోలింగ్ బూత్‌లు, దామెర –1, శాయంపేట–2, నడికూడ–2, పరకాల–4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు పరకాల ఆర్డీఓ కె.నారాయణ తెలిపారు. ఉదయ 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : వరంగల్–ఖమ్మం– నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సుభాషిణి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 1,928 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ పోలింగ్ కేంద్రం వద్ద విద్యుత్, తాగునీటి వసతి సమకూర్చారు.

సర్వం సిద్ధం

వేలేరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ ఆఫీసర్ ఆదివారం తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. మండలంలో 1,898 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కాగా ఆదివారం సాయంత్రం పోలింగ్ సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకున్నారు.

దామెర : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ జ్యోతివరలక్ష్మి తెలిపారు. నేడు (సోమవారం) జరగనున్న ఎన్నికల కోసం సిబ్బంది మండలకేంద్రానికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 1,331 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నిల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కొంక అశోక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెక్టోరల్ అధికారి జగన్‌మోహన్ రెడ్డి, ఆర్ఐ సంపత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

నడికూడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక విధుల్లో భాగంగా మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి ఆదివారం సాయంత్రం సామగ్రితో సిబ్బంది చేరుకున్నారు. రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, పోలీస్, ఇతర సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో 1,953 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు.

సంగెంలో..

సంగెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజ్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. పోలింగ్‌లో 12 మంది సిబ్బంది, ఆరుగురు పోలీసులు, మొబైల్ బృందాలు ఎన్నికల విధుల్లో పాల్గొంటాయని చెప్పారు. పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.


ఆత్మకూరు: పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న సిబ్బంది


శాయంపేట: పోలింగ్ కేంద్రం వద్ద..

బ్యాంకు సేవలు బహుదూరం

- పేరుకే కొత్తమండలం.. అభివృద్ధిలో నోచుకోని నడికూడ
- పట్టించుకోని పాలకులు, అధికారులు



నడికూడ : జిల్లాల పునర్విభజన సమయంలో నూతన మండలాలను ఏర్పాటు చేశారు. అయితే పేరుకే కొత్త మండలాలు ఏర్పాటు చేశారు తప్పా అభివృద్ధి మాత్రం ఆమడ దూరంలో ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పరకాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మండలాల సంఖ్యను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం నడికూడను 15 గ్రామాలతో నూతన మండలంగా ఏర్పాటు చేశారు. ఇటు పాలకులు, అటు అధికారులు ప్రజల కనీస సౌకర్యాలపై దృష్టి సారించడం లేదు. అయితే మండలంలో కనీసం ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకు సేవలు సైతం లేవు. దీంతో ఆర్థిక కార్యకలాపాలు, నగదు విత్‌డ్రా, డిపాజిట్, ఇతర చెల్లింపుల కోసం నిత్యం బ్యాంకులతో పని ఉంటుంది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎక్కువ శాతం రైతులు, వ్యవసాయ ఆధారిత కుటుంబాలు కావడంతో బ్యాంకు సేవలు అందకుండా పోతున్నాయి. దీంతో పని వదులుకొని పరకాలకు లేదా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. కాగా మండల కేంద్రంలో ఏటీఎం సేవలు అందుబాటులో ఉన్న అధిక మొత్తంలో నగదు విత్‌డ్రా చేసే సౌలభ్యం లేదు. దీంతో అనేక ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆన్‌లైన్ చెల్లింపులపై అంతగా అవగాహన లేకపోవడంతో చాలా వరకు మండల ప్రజలు బ్యాంకు సేవలకే మొగ్గు చూపుతున్నారు. అలాగే మండల పరిధిలోని కంఠాత్మకూర్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు ఏర్పాటు చేయగా దీన్ని పరకాల శాఖలో విలీనం చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కనీసం మండల కేంద్రంలో ప్రైవేట్ బ్యాంకును అయిన ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మండల పరిధిలో 15 గ్రామాలున్నాయి. ఎక్కడ బ్యాంకు లేకపోవడంతో మండలవాసులు ఆర్థిక లావాదేవీలకు అనేక ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు, పాలకులు చొరవ తీసుకుని బ్యాంకు సౌకర్యం కల్పించాలి.

- మహేందర్ రావు, నడికూడ

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం..



నడికూడ మండల కేంద్రంలో బ్యాంకు సౌకర్యం ఏర్పాటు చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తాం. అభివృద్ధిలో భాగంగా త్వరలో మండల కేంద్రంలో బ్యాంకు ఏర్పాటు అయ్యేలా చూస్తాం.

- అప్పం కుమారస్వామి, కాంగ్రెస్ నాయకుడు, నడికూడ

పోలింగ్ శాతం పెంచాలి



వరంగల్ / ఖిలా వరంగల్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో అధిక సంఖ్యలో పట్టభద్రులు ఓటువేసేలా పోలింగ్ శాతం పెంచేందుకు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నేత, తూర్పు ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో ఆయన ఆదివారం పర్యటించారు. పోలింగ్ ప్రక్రియపై బూత్ అధ్యక్షులు, ఏజెంట్లకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్, కర్నె రవీందర్, కుమార్, నాగరాజు, శ్రీనాథ్, తోట సురేష్, అశోక్, వాసుదేవ్, అర్జున్, రాజ్‌కుమార్, కృష్ణ పాల్గొన్నారు.